# ఆయా

పై అంతస్తులోని ప్రిన్సిపాల్ గది ఊడ్చి ఒక్కొక్క మెట్టే ఊడుస్తూ మెల్లగా కిందికి దిగుతున్నది ఆయా శాంతమ్మ. వయసు యాభైకి చేరుకుంటున్న ఆమె ఇరవై సంవత్సరాలుగా ఆ కాలేజీలోనే పని చేస్తున్నది.

రోజూ ప్రిన్సిపాల్ గదికి పట్టే బూజూ, దుమ్మూ దులుపుతుంది. ఆఫీస్ రూంలో చేరే చెత్త చెదారాన్ని ఊడ్చి శుభ్రం చేస్తుంది. స్టాఫ్ రూం, క్లాస్ గదులు, వరండాలు ఊడ్చి, బెంచీలు తుడిచి, కాలేజీ గ్రౌండ్‌లోని కాగితం ముక్కల్ని ఏరివేస్తుంది. మొక్కలకు నీళ్ళు పడుతుంది. కూజాల్లో నీళ్ళు నింపి పెడుతుంది.

ఆ పనులన్నీ చాలవన్నట్లు క్లాసు రూములకు నోటీసులు కూడా ఆమెనే తిప్పమంటారు. మూడు అంతస్తుల బిల్డింగ్ ఎక్కుతూ, దిగుతూ నోటీసులు క్లాసు లన్నింటికి తిప్పడం ఆ ముసలి ఆయాకు ఎంత కష్టమో గుర్తించినవాళ్ళు లేరు. ఆమె చేసే పనుల్లో మరో ఆయాకు, ఇంకో ప్యూనుకు సరిపడే పనివుంది. అయినా ముగ్గురు చేసే పనిని ఆమె ఒకదానితోనే చేయిస్తున్నారు.

స్టాఫ్ రూంలో ఎకనామిక్స్ లెక్చరర్ రంగనాథం కూర్చునే కుర్చీ తుడుస్తూ ఆలోచిస్తున్నది శాంతమ్మ.

'సార్లందర్లో పెద్ద సార్ తరువాత రంగనాథం సారే పెద్ద గదాని ఎన్ని సార్లు మొరపెట్టుకున్న! ... ఇన్ని పనులు నా ఒక్కదానితోటీ కావు రోజురోజు పని పెరిగిపోతున్నది సార్.... ఈ ముసలిదానిమీద దయ చూడుండ్రి. ఇంకో ఆయాని పెట్టించమని జెర పెద్దసార్‌కు చెప్పుండ్రి సార్' అని

"ఆఁ....ఆఁ....చూద్దాం...." అంటాడేగాని ఆయన ఆయా శాంతమ్మ విషయం ఎప్పుడూ సీరియస్‌గా పట్టించుకోలేదు - నిన్న మొన్నకాదు - కొన్నేండ్ల నుంచి ఆయా శాంతమ్మ అలా తన గోడు చెప్పుకుంటూనే వున్నది. ఆయన చూద్దాం-చూద్దాం అంటూనే ఉన్నారు.

లెక్చరర్ రంగనాథంగారు బిచ్చమెత్తుకునే వాళ్ళను చూస్తే తనకు జాలి అంటారు. దేశంలో రోజు రోజుకూ పేదరికం పెరిగిపోతున్నదని ఆవేదన చెందు తారు.

పేదరికానికి ముఖ్య కారణం నిరుద్యోగమనీ - నిరుద్యోగానికిగల కారణా లలో ప్రధానమైనది శ్రమ దోపిడీ అని ఎంతో బాగా లెక్చరిస్తారు-పదిమంది చేసే

పనిని ఐదుగురిచేత చేయిస్తాం - లేబరర్స్‌ను ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నాం - ఈ రకమైన శ్రమ దోపిడి మన దేశంలోని నిరుద్యోగానికి ఒక ముఖ్య కారణం.... అని క్లాసులో విద్యార్థులు చప్పట్లు కొట్టేంత ఆవేశంగా మాట్లాడ్తారు - ఇంతా చెప్పి శాంతమ్మ విషయం వచ్చేసరికి చూద్దాం చూద్దాం అంటారు.

ఆయన కుర్చీ దుమ్ము దులిపి పక్క కుర్చీని తుడుస్తున్నది శాంతమ్మ.

ఆ కుర్చీలో తెలుగు లెక్చరర్ నిరంజనశాస్త్రి కూర్చుంటారు గొప్ప గొప్ప కవితలు రాసి కళాపిపాసులను రంజింపచేస్తుంటారు. ఆయన కవితల్లోని గొప్పతనం మానవతా వాదాన్ని హృద్యంగా చిత్రించటం. గొప్ప మానవతావాది అని ఆయన పేరు తెచ్చుకున్నారు. ఆయన కుర్చీ దుమ్ము దులుపుతున్నది శాంతమ్మ.

ఆమె డ్యూటీ కాలేజీకే పరిమితం కాలేదు. కాలేజీ ఆవరణకూడా దాటింది.

ఆఫీస్ సూపరింటెండెంట్ శూర్పణఖరావు సందేహంగా అసురగణానికి చెందినవాడు. అతని ఇంట్లో పొద్దున పాచి పనిచేసి మరీ శాంతమ్మ కాలేజీకి రావాలి. అతనికి వేరే జీతం బత్తెమంటూ లేదు.

కాలేజీలో శూర్పణఖరావును ఎదిరించే గుండె ఎవరికీ లేదు. అతడు కోపంగా చూశాడంటే ప్రిన్సిపాలే తడబడి పోతాడు. కర్చీఫ్‌తో మొహాన్ని అద్దుకుంటాడు.

శూర్పణఖరావు ఆఫీసు కుర్చీలో బాసింపట్టు వేసుకొని కూర్చుంటాడు. ఆఫీసులో అందరూ ఫైళ్లు చూస్తుంటారు. అతడు బూతు పుస్తకాలు చూస్తుంటాడు. కొనని పాను నములుతూ కొనని సిగరెట్ తాగుతుంటాడు.

శూర్పణఖరావు ఆ కాలేజీని నడిపే మేనేజ్‌మెంట్ మనిషి-

"చేసి చేసి బొక్కలు తెల్లబడ్డాయి. ఇంకెంత కాలం ఆ సూపర్నెంటు ఇంట్ల ఊడిగం చెయ్యాలె సార్" తెలుగు లెక్చరర్ నిరంజనశాస్త్రికి చెబుతూ ఎన్నో సార్లు కంట తడి పెట్టుకున్నది శాంతమ్మ.

"కాలేజీ పనికి నియమించిన ఆయాచేత తన ఇంటి పనులుకూడా చేయించుకుంటున్నాడా శూర్పణఖరావు !?" ఉచ్చారణ దోషాలు లేకుండా చక్కని కంఠస్వరంతో ఆ మాటలంటారు నిరంజనశాస్త్రిగారు.

ప్రిన్సిపాల్‌గారితో మాట్లాడ్తాను - మాట్లాడ్తాను - మాట్లాడ్తాను అని కూడా అంటారు.

కాని ఎప్పుడూ మాట్లాడరు!

ఆయన కుర్చీ దుమ్ము తుడిచి ఇంగ్లీషు మేడం ఊర్వశి కుర్చీ కడకు వెళ్ళింది శాంతమ్మ.

ఇంగ్లీషు మేడం అసలు పేరు ఈశ్వరి. తెచ్చుకున్న పేరు ఊర్వశి. బొడ్డు కిందికి చీర కడుతుంది. అదేకాలమైనాసరే స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లు వేస్తుంది. ఆమె ఆదర్శ

మహిళా మండలికి అధ్యక్షురాలు- అలాంటి వేషం ఆదర్శమహిళకు ఉండాలన్నది ఆమె ఆదర్శం.

క్లాసు క్లాసుకు మధ్య ఆమెకో కప్పుడు కాఫీ కావాలి. మధ్యాహ్నం వడల టిఫిన్ కావాలి. ఆ కాఫీ అందిస్తూ- ఆ వడలు తెచ్చిస్తూ ఎన్నోసార్లు తన గోడు చెప్పుకుంది శాంతమ్మ.

కాఫీ సిఫ్ చేస్తూ, శాంతమ్మ చెప్పినదానికి ఎంతో హుందాగా 'ఊఁ' అంటారు ఊర్వశి మేడం.

ఎన్నడూ 'ఆఁ!!' అనరు.

ఎవరితోనూ శాంతమ్మ ఊసే ఎత్తరు.

ఆమె పక్కనున్న కుర్చీలో హిందీ లెక్చరర్ నిరంకుశం కూర్చుంటారు. ఆయనొక నిరంకుశ మహారాజు, ఇష్టం వచ్చినపుడు కాలేజీకి వస్తారు-ఇష్టం వచ్చి నపుడు వెళ్ళిపోతారు. ఒక్కొక్కసారి అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకంచేసి వెంటనే చెక్కేస్తుంటారు. తన గురించి తప్ప ఇతరుల గురించి పట్టించుకోరు.

ఆ కుర్చీ దుమ్ముకూడా తుడిచి నడుం నొస్తుంటె కొంచెంసేపు నిలుచ్చింది శాంతమ్మ.

టేబుల్‌కు ఒకవైపు ఉన్న కుర్చీలు తుడవడం అయింది. మరోవైపు మొదటి కుర్చీలో కామర్స్ లెక్చరర్ అప్పారావు కూర్చుంటారు. అడపాదడపా కాలేజీకి తాగివస్తారు. ఎప్పుడు చూసినా అతని కళ్ళు చింతనిప్పులే. పరచింత అసలు ఒప్పదు ఆ కుర్చీకి పట్టిన బూజు దులిపింది. దుమ్ము తుడిచింది శాంతమ్మ.

ఆ పక్కనున్న కుర్చీలో బాటనీ మేడం అశ్విని కూర్చుంటారు. ఆమెకు ఆయా శాంతమ్మపట్ల బోల్డు జాలి ఉంది కాని ఏం లాభం? ఆమె ఆయా శాంతమ్మ గూర్చి ప్రిన్సిపాల్‌తోనూ మాట్లాడలేరు, మేనేజ్‌మెంట్‌తో అసలే మాట్లాడలేరు. ఆమె పోస్ట్ పెర్మనెంట్ కాలేదు. ఆమె ఇంకా డి. హెచ్. ఇ. ఆఫీసు చుట్టూ, యూనివర్శిటీ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

అశ్విని మేడం పక్కనున్న కుర్చీ లెక్కల లెక్చరర్ మోహన్రావుది.

మొహం చిట్లించి మాట్లాడటం అతనికి అలవాటు. విసుక్కోవడం అతని హాబీ.

అతడు బాంక్ బాలెన్స్ తప్ప మరో ఆలోచన లేని టచ్‌మీనాట్ జీవి.

అలా ఒక్కొక్క కుర్చీ దులిపి తుడుస్తుంటే ఆ కుర్చీల్లో కూర్చునే లెక్చెరర్లు, వారి స్వభావాలు గుర్తుకొస్తున్నాయి శాంతమ్మకు.

కాస్సేపు అలా నుంచొని తుడిచిన కుర్చీల వంక ఒకసారి కలయజూసింది.

నలుగురు చేసే పనిని ఒక్కదానితో చేయిస్తున్నరు- ముసల్దనే జాలిలేకుండా మేడమీనికి, కిందికి తిప్పుతున్నరు - జెర పెద్దసార్‌కు చెప్పండిసార్. సెకెరెట్రీ సాబ్‌తోని మాట్లాడుండ్రి సార్ -

ఆ కుర్చీలకు శాంతమ్మ గుండె తన గోడు చెప్పుకుంటున్నది.

చూద్దాం .... చూద్దాం ....

మాట్లాడుదాం .... మాట్లాడుదాం ....

అట్లనా !

ఊఁ ....

అంటున్నాయి కుర్చీలు

దీర్ఘంగా నిట్టూర్చింది శాంతమ్మ.

ఒకరోజు మధ్యాహ్నం క్లాసురూములకు ఏదో నోటీసు తిప్పుతున్నది.

అప్పటిదాకా పనిచేసి చేసి అలసిపోయిందేమో పై అంతస్తు మెట్లు ఎక్క లేకపోతున్నది. అప్పటికే నాలుగైదుసార్లు మెట్లెక్కి దిగింది. కింద ఆఫీసు. పై అంతస్తులో ప్రిన్సిపాల్ రూం. ఉన్న ఇద్దరు ప్యూన్లకు ఏదో పని ఉండనే ఉంటుంది. అందుకే క్లాసు రూములకు నోటీసులు తిప్పేపని కూడా ఆయా శాంతమ్మ మీదనే వేస్తారు.

ఇంకో మెట్టుపైన పాదం మోపలేక క్షణకాలం అలాగే నిల్చుండిపోయింది శాంతమ్మ. కాళ్లు, చేతులు బరువుగా వొణుకుతున్నాయి. ఈమధ్య కొత్తగా వొచ్చింది గుండెదడ.

ఒళ్ళంతా చెమట పట్టింది.

ఆ నౌకరీ మానేద్దామా అన్నంత ఆయాసం కలుగుతుంది ఒక్కోసారి.

కాని తన సంసారం అవసరాలు గుర్తుకొస్తాయి.

ఎన్నడో పోయిన భర్త.

ఇద్దరు ఆడపిల్లలు.

పెద్దదానికి పెళ్ళయి పిల్లలు కలిగాక దాని భర్త ఆక్సిడెంట్‌లో మరణించాడు.

ఆ కూతురు, పిల్లల భారం తనమీదే పడింది.

చిన్న కూతురుకు ఇంకా పెళ్ళి కాలేదు.

ఇద్దరు కూతుళ్ళు బీడీలపని నేర్చుకొని చేస్తున్నారు. కాని ఆ వచ్చే పైసల్తో ఇల్లు గడవడం, పెద్దకూతురు పిల్లలను చదివించడం కష్టం –

తలవంచుకుని ఆయాసంతో కళ్లు మూసుకుంది శాంతమ్మ.

అవసరాలు మెడల్ని వంచేస్తాయి.

అవసరాలు మనుషుల్ని కాడెద్దులుగా, గానుగెద్దులుగా మార్చేస్తాయి.

అవసరాల్ని అసరాగా తీసుకొని వెట్టిచాకిరీ చేయించుకుంటారు.

గట్టిగా అడిగితే ఉన్న ఆ కొద్ది ఆసరా ఎక్కడ ఊడుతుందోనని భయం.

అడుగుతీసి అడుగు వేయాలంటే నీరసంగా కష్టంగా ఉంది. యాభై ఏళ్ళతే ఆరవై ఏళ్ళ భారాన్ని మోస్తున్నది శాంతమ్మ. మోకాళ్ళు పుండులా సలుపుతున్నాయి.

మరో మెట్టుమీద ఆగి కొంగుతో మొహం, మెడమీది చెమట తుడుచుకుంది.

శక్తినంతా కూడదీసుకొని అడుగుతీసి అడుగువేసింది. మూడంతస్తుల బిల్డింగ్ మెట్లెక్కి దిగి ఆ నోటీసును క్లాసురూముల్లో తిప్పాలి. స్టాఫ్‌రూం, లైబ్రరీ రూముల్లో చూపించాలి.

డాక్టరుకేం ఎన్నైనా చెప్తాడు.

తనకు గుండెపోటట–

రెస్ట్ తీసుకోవాలట !

అతని ఫీజు కోసమైనా కష్టపడాల్సిందేగా....

* * *

ఆయాసపడుతూ....రొప్పుతూ....ఎలాగో కష్టపడి ఆ నోటీసును తిప్పి తిరిగి ఇవ్వడానికి ఆఫీసులోకి వచ్చింది.

"ఇంతసేపు తిప్పుతావా నోటీస్ ?" మొహమంతా చిట్లించి కసురుకున్నాడు కుర్చీలో బాసింపట్టు వేసుకొని కూర్చున్న సూపరిండెంట్ శూర్పనఖరావు.

"పని తప్పించుకోవాలనే కదా... ఎటుపోతె అటే గంటలుగంటలు పోతావ్?" అని మండిపడ్డాడు.

"రామ ! రామ !"

తలవంచుకొని నిలుచుంది శాంతమ్మ. ఆమె అరికాళ్ళు భగభగ మండుతున్నాయి. ఆమె కళ్ళు భగభగమండవు.

"అమ్మగారు ఫోన్ చేశారు" అన్నాడు శూర్పనఖరావు.

అమ్మగారంటే శూర్పనఖరావు భార్య.

"లూసీకి సుస్తీగా ఉందట."

లూసీ అంటే శూర్పనఖరావు కుక్కపిల్ల.

"దవాఖానకు తీసుకపోవాల్నట. అమ్మగారు రమ్మన్నరు. జల్దీ ఇంటికి పో....పో...."

కాలేజీ ఆయాకు తన ఇంటి పనులు చెబుతున్నప్పుడుకూడా కసురుకోవడమే.

విశ్రాంతనేది లేకుండా మండుటెండలో శూర్పనఖరావు ఇంటికి బయలుదేరింది శాంతమ్మ.

కాలేజీ నుంచి కిలోమీటరు దూరంలో ఉంటుంది శూర్పనఖరావు ఇల్లు.

మాడు కాలిపోతున్నది.

తలమీద కొంగు కప్పుకొని భారంగా అడుగులు వేస్తున్నది శాంతమ్మ.

మడమలు అరగిపోయిన చెప్పుల వలన సగం పాదాలు నేలకుతాకి చురుక్కు మంటున్నాయి.

ఇంకెన్ని - పదిరోజులే కాలేజి.

ఆ తరువాత పరీక్షలు....

పరీక్షలయితే నెలా పదిహేను రోజులు సెలవులు.... ఎంత కావాలంటే అంత విశ్రాంతి.

వెంటనే శూర్పనఖరావు ఇల్లు గుర్తుకొచ్చింది. మరి సెలవుల్లో శూర్పనఖ రావు ఇంటి చాకిరీ తప్పుతుందా? అయ్యో భగవంతుడా తప్పదు!

ఇంకో పది అడుగులు....

అదిగో సూపర్నెంటు ఇల్లు వచ్చేస్తున్నది అనుకుంటూ నడుస్తున్నది.

శక్తినంతా కూడదీసుకొని నడుస్తున్నది. సూపర్నెంటు కుక్కకు సుస్తీ చేసిందట. తప్పు తప్పు సూపర్నెంటుగారి కుక్కకు సుస్తీ చేసిందట.

తలమీది కొంగు వేడెక్కింది....

చెమటతో నుదురు, మెడ తడిసింది. చెమట బిందువులు కనుబొమ్మల మీదినుంచి కళ్ళలోకి జారి కళ్ళు మండుతున్నాయి.... పెదవులమీదికి జారి నోరును ఉప్పుచేస్తున్నాయి.... కాలిమడమలు తీపులు తీస్తున్నాయి.... సూపర్నెంటుగారి కుక్కకు సుస్తీ అట.... శాంతమ్మ గబగబ నడుపు.... గబగబా.... గబగబా....

కడుపులో పేగులు అరుస్తున్నాయి. మధ్యాహ్నం భోజనం చేయలేదని గుర్తు కొచ్చింది శాంతమ్మకు. నోటీసులు.... మెట్లు.... ప్రిన్సిపాల్ రూం.... ఆఫీసు.... అంతలో సూపర్నెంటుగారి కుక్కకు సుస్తీ అని కబురు.... మళ్ళీ నడక.... గబగబా.... గబగబా....

తన పెద్దకూతురు కొడుక్కి జబ్బుచేసింది. రెండురోజుల్నుంచి మూసిన కన్ను తెరవడంలేదు. డాక్టరుకు చూపించింది. పేదవాళ్ళకు మందులేముంటాయి? రంగునీళ్లు.... తెల్లని బిళ్ళలు. అంతే!

ఆ బిళ్ళలు మింగి ఆ రంగునీళ్ళుతాగాడు శాంతమ్మ మనవడు- అప్పటిదాకా లేని వాంతులు రెండయినాయి- కూతురు భయపడి- ''ఓవ్వ.... ఇయ్యాల కాలేజీకి పోకే'' అన్నది.

మరి తాను పోకపోతే కాలేజీలో ఊడ్చేవాళ్ళెవరు?

''వాంతులు తగ్గినయిగదా- బుగులుపడకు బిడ్డా-'' అని కూతురికి ధైర్యం చెప్పింది- కాలేజీకి బయలుదేరింది. మొదట 'సూపరెన్నెంటు' ఇంటికే వెళ్ళింది- అప్పుడు బాగానే ఉంది కుక్కపిల్ల.

'ఓవ్వ.... ఇయ్యాల తొరగా రాయె-' కూతురు దీనంగా తనను వేడుకుంది. దాని భర్త పోయి మూడేండ్లయింది. 'గా పొలగాన్ని పొల్లను చూసుకొని బతుకు తాంది బిడ్డ పొలగాని కెట్లున్నదో ఏమో'

'శాంతమ్మా! ఏం ఆలోచిస్తున్నావ్? సూపరెన్నెంట్‌గారి కుక్కకు సుస్తీ అట.... గబగబా నడువు. గబగబా' అందామె అంతరాత్మ.

గబగబానే అడుగులు వేస్తున్నది శాంతమ్మ.

ఒక్కసారిగా గుండెలో కలుక్కుమన్నది.

'అన్నా....గుండెల ఎట్లనో అయితాంది!' అనుకుంటూ కాస్సేపు కదల కుండా అలాగే నిలుచుంది.

సోడా తాగుదామంటే....సూపరెన్నెంట్‌గారి కుక్కకు సుస్తీ అట.... ఆలస్య మవుతుందో ఏమో....

మళ్ళీ నడక....

మనసు పరుగు....

నడక....నడక....

సూపరిండెంట్ ఓ కుక్కను పెంచుతున్నాడంటే ఓ జీవిని పోషిస్తున్నా డన్నమాట! దానికి జబ్బు చేస్తే శ్రద్ధగా ఆసుపత్రికి కూడా పంపుతున్నాడంటే. 'శూర్పనఖరావు గొప్ప దయాశీలి' అనికూడా కితాబు ఇవ్వవచ్చు.

పుస్తకం హస్తభూషణం ఒకప్పుడు. శునకం గృహభూషణం అయింది ఇప్పుడు. ఇంటికో గేటు - దానికో కాలింగ్‌బెల్....ఓ పనిమనిషి.... ఓ కుక్కపిల్ల వుంటేనే హోదా.

ఆ హోదా కోసం కుక్కను పెంచుతున్నాడు శూర్పనఖరావు. దొంగల్ని బెదిరించటానికని ఈ కాలంలో కుక్క పిల్లలనెవరూ పెంచటంలేదు. అన్నిరంగా ల్లోనూ ఆరితేరిపోతున్న దొంగలు కుక్కల విషయంలోనూ తెలివిమీరిపోయారు. తుపాకులున్న జైలర్లను, పోలీసుల్నే ఏమార్చుతున్న దొంగలకు అరిచే కుక్కలు ఒక లెఖ్ఖకాదు. పైగా అరిచే కుక్క కరవదనే సామెత వుండనే వున్నది.

చంటిపిల్లను ఆయాకు అప్పగించి కుక్కపిల్లను చంకనెత్తుకొంటున్నారీ రోజుల్లో. పిల్లలమీద లేని ప్రేమ కుక్కపిల్లలమీద ఎలా కలిగిందో? చంటిపిల్లకంటె కుక్కపిల్లను ఎత్తుకోవడంలోనే వారికి హోదా ఎలా కనిపిస్తోందో? అవును మరి.... అదే ఇప్పటి హోదా।

సూపరెంటుగారి నవరు హోదాకి సుస్తీ చేసింది. శాంతమ్మ గబగబా నడుస్తున్నది.

రెండు గంటలయ్యింది గాలి మాత్రమే పీలుస్తున్నది శాంతమ్మ. దాహానికి నీళ్ళులేవు – ఆకలికి అన్నంలేదు.

అతి కష్టంమీద సూపరింటెండెంట్ ఇల్లు చేరుకుంది.

గేటు తీసి లోనికి రెండడుగులు వేసిందో లేదో అమ్మగారు రౌద్రాకారంతో ఎదురు వచ్చారు.

'ఫోనుచేసి ఎంతసేపయిందే.... ఇప్పుడా వస్త.... ఇంటికిపోయి తిరిగ్గా వచ్చినావు?' కోపంగా అడిగింది అమ్మగారు.

సూపరింటెండెంట్ శూర్పనఖరావుగారి హోదా అరుగు అంచున కూర్చొని గుర్రుగా చూస్తోంది.

నోరుంటే అదీ మండిపడేదేనేమో.

'ఏమే ఎంత నిర్లక్ష్యం నీకు– నేను సుస్తీగా వున్నానని అప్పుడనగా ఫోను చేయిస్తే ఇప్పుడొచ్చావా?– నిన్ను డిస్మిస్ చేయిస్తాను చూడు....' అని

'సెంటర్లో ఆటోవుందేమో మాట్లాడుకరాపో—'

వెనక్కు తిరిగింది శాంతమ్మ.

మళ్ళీ నడక.... నడక....

వొణుకు.... నీరసం.... అరికాలి మంటలు.... గుండెలో భారం.... ప్రాణమంతా కూడదీసుకొని నడుస్తున్నది....

ఫర్లాంగుదూరం నడిచాక ఒక ఖాళీ ఆటో ఎదురయింది.

రానని మొరాయిస్తున్న సూపరింటెండెంట్ శూర్పనఖరావుగారి హోదాను బుజ్జగించి చంకనెత్తుకొని ఆటోలోకి ఎక్కించింది శాంతమ్మ. డాక్టరుగారితో ఫోనులో మాట్లాడాను అని చెప్పారు అమ్మగారు. మనిషిని పంపిస్తున్నాను అని చెప్పానులే అన్నారు.

* * *

వెటర్నరీ హాస్పటల్ నుంచి తిరిగి వచ్చి కుక్కపిల్లను జాగ్రత్తగా సూపరింటెండ్ ఇంట్లో దించింది శాంతమ్మ.

'వెళ్ళొస్తానమ్మా' అని అమ్మగారికి చెప్పింది. ఆమె గొంతు పెగలక మాట సరిగా రాలేదు. నాలుక పిడుచగట్టుకపోతున్నది.

'ఊఁ.... పొద్దున తొందరగా రా- రేపు పని బాగావుంటుంది-' అన్నారు అమ్మగారు.

'అట్లనే అమ్మా' తలూపింది శాంతమ్మ.

వెనక్కి తిరిగింది.

ఒక మెట్టు దిగి మరో మెట్టుమీద పాదం మోపిందో లేదో ఆమె గుండెలో మరోసారి కలుక్కుమంది- ఆ పాదం నిలవక జారి.... కుప్పలా కూలబడిపోయింది శాంతమ్మ.

* * *

మరునాడు ఉదయం తెలుగు లెక్చరర్ నిరంజనశాస్త్రి హడావిడిగా ఎకనామిక్స్ లెక్చరర్ రంగనాథంగారితో ఏదో మాట్లాడారు.

రంగనాథంగారు అప్పారావుగారితోనూ- నిరంకుశంగారితోనూ మాట్లాడారు.

అంతలో ఊర్వశి మేడం.... మిగతా లెక్చరర్లు వచ్చారు.

అందరూ కలిసి ప్రిన్సిపాల్ గదికి వెళ్ళారు.

'సార్.... నిన్న మరణించిన ఆయా శాంతమ్మ ఆత్మశాంతికి సంతాపసభ జరపాలి. ఈ రోజు కాలేజీకి సెలవు ప్రకటించాలి-' అని ముక్తకంఠంతో అడిగారు.

★ ★